క్లుప్తంగా

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



త్యాగరాజ వేషధారణలో సంగీత విద్వాంసుడు మల్లాది నారాయణ శర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ప్రముఖ సంగీత విద్వాంసుడు మల్లాది నారాయణ శర్మ త్యాగరాజ వేషధారణలో నగరంలోని రామచంద్రరావు పేట వీధుల్లో ఉంఛ వృత్తి నిర్వహించారు. ఫైన్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి సావిత్రి, దువ్వి హేమ సుందర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుడిపాటి లలితా శర్మ, మేడూరి శివరాం, రఘురాం సోదరులు, పార్వతి రామచంద్రన్, ద్రోణం రాజు శైలజ, వేదుల జయలక్ష్మి, శిరీష, పీవీఆర్ ఆర్‌కే శాస్త్రి, మైలవరపు గురు శర్మ పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ఏలూరు రూరల్: ఆదివారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణురాలు పుచ్చల రాజేశ్వరి తన సిబ్బందితో కలిసి రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. అనంతరం అసోసియేషన్ ప్రెసిడెంట్ అక్బర్, కార్యదర్శి నాగ విఘ్నేశ్వరరావు డాక్టర్ పుచ్చల రాజేశ్వరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి విశ్వనాథ్ మాధవరావు, ఉపాధ్యక్షుడు కొమ్మా నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఎస్ జగదీషన్‌తో పాటు ఎస్‌కే సత్తార్, జంపా సూర్యనారాయణ, సాంబశివ రావు పాల్గొన్నారు.

జల్లికొమ్మరలో జాతర కోలాహలం

గణపవరం: గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, గ్రామ దేవత గోగులమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి నైవేద్యాల సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరులు చినబాబు, కన్నబాబు, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, పార్టీ ప్రముఖులు కాకర్ల శ్రీను, వివిధ పార్టీల నియోజకవర్గ నాయకులు, సర్పంచ్‌లు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి సేవ నిర్వహించి, పూజల అనంతరం నైవేద్యాల సమర్పణ కార్యక్రమం ప్రారంభించారు. ఆలయం వద్ద పంబరులతో అమ్మవారి కథలు చెప్పించారు.

సొంతింటి కల సాకారం

- పేదలకు పక్కా ఇళ్లు
- ఏలూరు రూరల్ మండలంలో చురుగ్గా నిర్మాణాలు
- లబ్ధిదారులకు రూ.12,77,81,000 అందజేత
- 1,088 గృహ నిర్మాణాలు పూర్తి



జాలిపూడిలో నిర్మిస్తున్న గృహాలు



జాలిపూడి కాలనీలో నిర్మించిన ఇల్లు



చాటపర్రులో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు తదితరులు

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల సొంతిల్లు కల సాకార మవుతోంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు ఎందరో సొంతిల్లు నిర్మించుకుని సంతోషంగా జీవిస్తున్నారు. దీనికి కారణం పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సహించడమే. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హౌసింగ్ శాఖకు కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తున్నారు.

జగనన్న కాలనీల్లో రోడ్ల అభివృద్ధి

2023 నవంబర్ నెలాఖరు నాటికి ఏలూరు రూరల్ మండలం పరిధిలోని గ్రామాల్లో 1,088 మంది సొంతిల్లు నిర్మించుకున్నారు. వీరికి ప్రభుత్వం రూ.12,77,81,000 అందజేసింది. మరోపక్క 11 జగనన్న కాలనీల్లో రోడ్లు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసిందని హౌసింగ్ ఏఈ లక్ష్మణ వెల్లడించారు. ఈ మొత్తం నిధులతో త్వరలో గ్రావెల్ రోడ్లు పనులు ప్రారంభించనున్నామని వివరించారు. దీనికి తోడు కాలనీలకు వెళ్లే దారిలో అడ్డంగా ఉన్న పంట కాలువ, ముురుగుదారుల గుండా కల్వర్టులు, వంతెనలు నిర్మించనున్నామని వివరించారు.

గృహ నిర్మాణానికి గ్రామాల వారీగా కేటాయించిన నిధులు

చాటపర్రుకు రూ. 2,96,35,873, పైడిచింతపాడుకు రూ.81,96,482. ప్రత్తికోళ్లలంకకు రూ.1,25,93,456. కేడీపురంలో రూ.3,28,1459. కోమటిలంకకు రూ.26,12,393. శ్రీపర్రుకు రూ.1,09,08278. పెద యాగనమిల్లికి రూ.1,50,0000. గుడివాకలంకకు రూ.6,54,6651. జాలిపూడికి రూ. 2,02,21,461. మల్కాపురానికి రూ.1,91,57,344. మాదేపల్లికి రూ.1,31,28,091 ప్రభుత్వం అందజేసింది.

నాలుగు దశల్లో నగదు మంజూరు

ఇంటి నిర్మాణం చేపట్టిన పేదలకు అధికారులు క్రమం తప్పకుండా నిధులు మంజూరు చేస్తున్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కాలనీల వద్దకే ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉంచుతున్నారు. పనులు ప్రారంభం కాగానే బేస్‌మెంట్ లెవెల్‌లో రూ.70,000, రూఫ్ లెవెల్‌లో రూ.37,600, రూఫ్ కాస్ట్ రూ.21,200, చివరి దశలో రూ.21,200 లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీనికి తోడు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతనం రూ.30,000 అందిస్తున్నారు. దీనికి తోడు మరో రూ.30 వేలు లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల నుంచి అప్పుగా అందజేస్తున్నారు.

అధికారుల ప్రత్యేక శ్రద్ధ

ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ అధికారులతో పాటు మండల పరిషత్, ఇంజినీరింగ్ శాఖాధికారులతో పాటు సచివాలయ సిబ్బంది సైతం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలుసుకుని వారికి అవసరమైన రోడ్లు, నీటి వసతి తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణం



మా గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. లబ్ధిదారులు ఎంతో ఉత్సాహంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తోంది. కొత్త వారికి సైతం అధికారులు పట్టాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాకు కనెక్షన్లు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సహకారంతో మా గ్రామంలో పేదలకు సొంతిల్లు ఏర్పాటవున్నందుకు సంతోషంగా ఉంది.

– ముంగర తిమోతీ, పైడిచింతపాడు సర్పంచ్

మౌలిక వసతులు కల్పించాం



కొల్లేరు గ్రామాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకోవాలంటే ఎంతో వ్యయం అవుతుంది. భూమి బురదమయం కావడం వల్ల ముందుగా మెరక చేసుకోవాలి. ఈ సమస్యను గుర్తించి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేయడంతో జగనన్న కాలనీలకు కేటాయించిన స్థలాలను మెరక చేశాం. దీనివల్ల లబ్ధిదారులకు భవిష్యత్తులో ఎలాంటి ముంపు సమస్య ఉండదు. కాలనీల్లో బోర్లు, విద్యుత్ ఏర్పాటు చేసాం. రానున్న రోజుల్లో గ్రావెల్ రోడ్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– జి. శ్రీనివాసరావు, తహసీల్దార్

అసైన్డ్ భూముల చట్ట సవరణను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): భూయాజమాన్య హక్కుల చట్టం, అసైన్డ్ భూముల చట్ట సవరణను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం వక్తలు కోరారు. స్థానిక పవరు పేటలోని అన్నే భవన్‌లో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, ఐలు జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ తదితరులు మాట్లాడారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలకృష్ణ కిషోర్ శర్మకు వరాహమిహిర పురస్కారం



జ్యోతిష్య శాస్త్ర వరాహమిహిర పురస్కారం అందుకుంటున్న బాలకృష్ణ కిషోర్ శర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని నరసింహారావు పేటకు చెందిన జ్యోతిష్య సమృతి అవధాని గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్ శర్మకు జ్యోతిష శాస్త్ర వరాహమిహిర పురస్కారం లభించింది. విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ హబ్సిగూడలోని కిన్నెర గ్రాండ్‌లో నిర్వహించిన జ్యోతిష్య వైదిక సమ్మేళనంలో బాలకృష్ణ కిషోర్ శర్మ పాల్గొని సమాజానికి జ్యోతిష్య శాస్త్రం ఆవశ్యకత, ప్రస్తుత పరిస్థితిలో జ్యోతిష్య శాస్త్ర మనుగడ తదితర అంశాలపై ప్రసంగించారు. శర్మ జ్యోతిష్య శాస్త్రంలో 4 సార్లు జాతీయ స్థాయి అవార్డులు, అంతర్జాతీయ జ్యోతిష్య శాస్త్రవేత్త అవార్డు పొందారు. శాస్త్ర అభివృద్ధికి కృషి చేస్తున్న శర్మకు విశ్వజ్యోతి విజ్ఞాన సంస్థ జ్యోతిష్య శాస్త్ర వరాహ మిహిర పురస్కారాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రధానార్చకుడు నల్లంతిహల్ లక్ష్మీ నరసింహాచార్యులు చేతుల మీదుగా ప్రదానం చేశారు.

అలరించిన 'పాడనా తీయగా' కార్యక్రమం



పాడనా తీయగా కార్యక్రమంలో పాల్గొన్న వర్ధమాన గాయకులు, అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఎస్ పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నూతన గాయకులను ప్రోత్సమించే నిమిత్తం నిర్వహించిన పాడనా తీయగా కార్యక్రమం నగర ప్రజలను విశేషంగా అలరించింది. ఆదివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక మంది వర్ధమాన గాయకులు తమ గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించారు. వివిధ సినిమాల్లోని విజయవంతమైన గీతాలను శావ్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి బుల్లితెర సంగీత దర్శక గాయకుడు డాక్టర్ చంటి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అనంతరం డాక్టర్ చంటిని సుస్వర సామ్రాట్ పురస్కారంతో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ గాయకునికి ఎస్ పీఎస్ బెస్ట్ సింగర్ అవార్డును బహూకరించారు. మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌పీఎస్ వాసు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజావలీ, మానవత సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టికెట్లు కేటాయించాలి



జిల్లా రజక జన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన రజకులకు రెండు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టికెట్లను కేటాయించాలని రజక జన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా రజకులున్నారన్నారు. నేటికీ రజకులు రాజ్యాధికారానికి దూరంగానే ఉంటున్నారని అన్నారు. చెరువుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన జీవోలను అధికారులు అనుసరించకపోవడం వల్ల రజకులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేసారు. వచ్చే నెలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన మహాసభను ఏలూరులో నిర్వహిస్తామని ఆయన చెప్పారు. జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి విటాల శ్రీనివాసరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ కొమ్మంటి మురళి, సీనియర్ నాయకులు జుజ్జువరపు శ్రీనివాసరావు, యలమంచిలి నాగేషు, చింతాడ శ్రీనివాసరావు, పున్నపు నరసింహారావు, పగడాల సాంబశివరావు, తూటిగుంట్ల దుర్గారావు, ఒడిగళ్ల శ్రీనివాసరావు, దేవరపల్లి సుబ్బయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. అప్పనవీడులో పేకాట స్థావరంపై ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేసారు. పేకాట ఆడుతున్న జూదరుల నుంచి రూ.1,060 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కే శుభశేఖర్ తెలిపారు.

వైభవంగా గొలుసుల పంజా ఉరుసు ఉత్సవాలు



సంథల్ షరీఫ్ కార్యక్రమంలో గంధం ఊరేగింపు నిర్వహిస్తున్న గొలుసుల పంజా ముజావర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ మహాత్ముని దర్గా (గొలుసుల పంజా) ఉరుసు ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7 గంటల నుంచి ఆయతే కరీమా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు దివ్య ఖురఆన్ గ్రంథ పారాయణ నిర్వహించారు. ఏలూరు అహలే సున్నత్‌వల్ జమాత్ అధ్యక్షుడు షేక్ సాబీర్ హుస్సేన్ హజరత్ మౌలా అలి మహాత్ముని జెండా ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాత్రి 6 గంటల నుంచి పిచ్చుకగుంట హజరత్ యాఖుబ్ ఖాన్ బాబా దర్గా వద్ద షేక్ జానీ నివాసం నుంచి సంథల్ షరీఫ్ (గంధం) ఊరేగింపు కార్యక్రమం ప్రారంభమై రాత్రికి గొలుసుల పంజా వద్దకు చేరుకుంది. గంధం ఊరేగింపు కార్యక్రమంలో పలువురు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు గొలుసుల పంజా వద్ద దరూద్ సలాం ఫాతెహా ఖానీ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వంశపారంపర్య ముజావరులు ఎండీ వజీర్ అలి మాట్లాడుతూ నగరంలో వందల ఏళ్లుగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయని, కేవలం నగరం నుంచి మాత్రమే కాక వివిధ ప్రాంతాల నుంచి మహాత్ముని దర్శనార్థం అనేక మంది తరలివస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ రాజా అహ్మద్, ఎండీ ఇక్బాల్, ముజావర్లు ఎండీ గాలబ్ అలి, మౌలా అలి, ఖాదర్ అలి, నాసర్ అలి, మున్వర్ అలి, షాహేద్ అలి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ రజతోత్సవాలను జయప్రదం చేయండి



కె. కాంతారావు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



ఎం. ఆదినారాయణ, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే ఫిబ్రవరి 10, 11 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రజతోత్సవ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కే నరహరి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో నిర్వహించిన డీటీఎఫ్ ఏలూరు జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలన్నీ సకాలంలో చెల్లించాలని, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. అనంతరం జిల్లా కౌన్సిల్ జిల్లాలోని వివిధ మండలాలకు కన్వీనర్లను ప్రకటించింది. ఏలూరు జిల్లాకు కే. దాసు, కామవరపుకోటకు ఏ.రవి, బుట్టాయగూడెంకు ఏ. ఏసుదానును కన్వీనర్లుగా ప్రకటించింది. అనంతరం ఏలూరు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కే. కాంతారావు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఏవీ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా ఎం. ఆదినారాయణ, కార్యదర్శులుగా బీ. వెంకటేశ్వరరావు, ఎం. సత్యం, డీ. సురేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వీ. కృష్ణ శేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎస్‌వీ శ్రీనివాసరావు, కే. సురేష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కే సురేష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు కే త్రినాథరావు, ఎస్‌వీ శ్రీనివాసరావు, వీ. అనంత కుమార్, ఎస్.సాయిబాబా, ఎస్‌వీ సుబ్బారావు, బీ. వెంకటేశ్వరరావు, వైవీ రామారావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లూ... సమాచారమివ్వండి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న రైల్వే ఎస్సై నరసింహారావు

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే ఆటోస్టాండ్‌లోని ఆటో డ్రైవర్లు అసాంఘిక శక్తుల సమాచారాన్ని తమకు ఇవ్వాలని, ఆటోలో నిషేధిత వస్తువులతో ప్రయాణించే వారి వివరాలు తెలియజేయాలని ఏలూరు రైల్వే ఎస్సై డీ.నరసింహారావు తెలిపారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు ఆదివారం ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. గంజాయి, అక్రమ మద్యం, నిషేధిత వస్తువులు ఏవైనా ఆటోలో ప్రయాణికులు తీసుకు వస్తున్నట్లు మీకు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇక రైలులో ప్రయాణించే వ్యక్తుల బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లు, బంగారు నగలు, విలువైన వస్తువులను చోరీ చేసే వారి సమాచారం తెలిసినా రైల్వే పోలీసులకు తెలియజేయాలని కోరారు. రైల్వే ప్రయాణించేందుకు మీ ఆటోల్లో వెళ్లే వారి పట్ల గౌరవంగా నడచుకోవాలని సూచించారు. ప్రతి డ్రైవర్ వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆటో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు రాజ్యాధికారం



బీసీ సంఘాల నాయకులతో ఈడా చైర్మన్ బొద్దాని, లక్కోజు గోపి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీతోనే బీసీలకు రాజ్యాధికారం దక్కిందని ఏలూరు అర్బన్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి అన్నారు. ఏలూరు పార్లమెంట్ సీటును బీసీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించే కార్యక్రమంలో భాగంగా వారు నగరంలోని పలు బీసీ సంఘాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక వన్‌టౌన్‌లో నాయీబ్రాహ్మణ, సగర సంఘాలతో ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొద్దాని, లక్కోజు గోపి మాట్లాడుతూ ఏలూరు ఎంపీ సీటును బీసీలకు కేటాయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఎక్కడా లేని విధంగా ఏలూరులో 23 బీసీ కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించి వాటికి నిధులు సమకూర్చిన ఎమ్మెల్యే ఆళ్ల నాని వెంటే బీసీలంతా ఉండాలని కోరారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలకు వెన్నుదన్నుగా ఉంటూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను, ఎమ్మెల్యేగా ఆళ్ల నాని, ఎంపీగా కారుమూరి సునీల్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం బీసీలకు ఉందని గుర్తు చేసారు. విద్యావంతుడు, బీసీ ముద్దుబిడ్డ అయిన కారుమూరి సునీల్‌ను ఎంపీగా గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు బీసీలు అంతా సమష్టిగా అందిద్దామంటూ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయీబ్రాహ్మణ, సగర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు భరోసా

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే బీసీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక భరోసా లభిస్తుందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అఖండ విజయాన్ని అందించటంలో బీసీలు కీలకంగా వ్యవహరించాలని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ కోరారు. ఏలూరు ఫిరంగుల దిబ్బలోని కమ్యూనిటీ హాలులో బీసీ సగర కుల సంఘం సమావేశాన్ని కుప్పాల ఆంజనేయుల అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఇడా చైర్మన్ బొద్దాని, వైఎస్సార్ సీపీ నగర బీసీ సెల్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారికి పుష్పగుచ్ఛం అందజేసి సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు రాబోయే ఎన్నికల్లో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని బీసీలకు అండగా నిలుస్తూ, అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని ఇస్తున్నారని, రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న తరుణంలో ఆయన విజయానికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సగర కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా కుల గణన సర్వే

భీమడోలు: మండలంలో కుల గణన సర్వే చివరి దశకు చేరుకుంది. ప్రభుత్వం కుల గణనలోని సామాజిక, ఆర్థిక అంశాలపై ఆదివారంతో సర్వే పూర్తి చేయాలని ఆదేశించింది. రాష్ట్ర చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా కుల గణన సర్వే చేసి సామాజిక విప్లవానికి ప్రభుత్వానికి నాంది పలికింది. మండల వ్యాప్తంగా 89.03 శాతం సర్వే పూర్తయ్యింది. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ నాటికి సచివాలయాలకు వెళ్లి కుల గణన చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మండల వ్యాప్తంగా 23,030 కుటుంబాల్లో 62,957 మంది ఉండగా ఇప్పటి వరకు 89.03 శాతం సర్వే పూర్తయ్యిందని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి నమోదు చేసారు.

రాట్నాలమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు

పెదవేగి : రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారికి ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ. 50,875, విరాళాలు రూ.29,187, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.15,000, ఫొటోల విక్రయంతో రూ.3,685, మొత్తం రూ.98,747 ఆదాయం లభించిందని కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	24
వంకాయలు (కాంతులు)	20	బీన్లచిక్కుడు	34
వంకాయలు (తెలుపు)	32	చామదుంపలు	60
బెండకాయలు	40	ములక్కాడలు	10-12
పచ్చిమిర్చి	34	కంద	60
కాకర కాయలు	48	బీట్‌రూట్	30
బీరకాయలు	44	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	25-30	అల్లం	120
క్యారెట్	36-40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	26	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	08
దోసకాయలు	34	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	17
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33